ప్రజాశక్తి
శనివారం 30 ఆగస్టు 2025
5
కర్నూలు

కర్నూలు ఉల్లిమార్కెట్‌ను సందర్శించి వ్యాపారులు, అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

-హాస్పిటల్స్‌కు క్యూ కడుతున్న రోగులు
-జాగ్రత్తలు అవసరం అన్న వైద్యులు

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం, నిమోనియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్ గున్యా, డయేరియా కేసులు పెరిగాయి. ఈ కేసులతో హాస్పిటల్స్, క్లినిక్స్ నిండిపోతున్నాయి. జిజిహెచ్ పిల్లల విభాగం ఓపిలో సాధారణ సమయంలో 150 నుంచి 200 ఓపీలు వుంటే ప్రస్తుతం 250 నుంచి 300 దాకా పెరిగాయి. వీటిలో దగ్గు,

జలుబు, జ్వరం 50శాతం, [illegible]యా కేసులు 20 శాతం

పెరిగిన దోమలు (ఫైల్)

ఉన్నాయి. జనరల్ మెడిసిన్ విభాగంలో 300 ఓపిలల్లో సీజనల్ కేసులు 50 నుంచి 60 దాకా వున్నారు. ప్రయివేట్ హాస్పిటల్స్, క్లినిక్స్ లో వైరల్ ఫీవర్ రోగుల సంఖ్య ఎక్కువగానే ఉంది.

వేడి వాతావరణం నుంచి చల్లని వాతావరణంలోకి మారడం వల్ల శరీరం తట్టుకోలేక దగ్గు, జలుబు, జ్వరం వంటి వైరల్ ఫీవర్స్ ఎక్కువయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పాడైపోయిన టైర్లు, టెంకాయలు, పాత సామాన్లలో నీరు నిల్వ ఉండడం ద్వారా అందులో పగటి పూట దోమలు చేరి ఇవి మనుషులను కుట్టడం ద్వారా డెంగీ జ్వరం, చికెన్ గున్యా వస్తాయి. డెంగీ జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారుతుంది. ఇటీవల వెల్దుర్తికి మండలానికి చెందిన మోక్షిత (7) చిన్నారి డెంగీ జ్వరంతో మరణించింది.

డెంగీ, మలేరియా ప్రమాదకరం వైద్యులను సంప్రదించాలి

డెంగీ జ్వరం వచ్చినప్పుడు ఒళ్ళ నొప్పులు, వాంతులు, తలనొప్పి, వెన్నుపూస నొప్పి, మనిషి మబ్బుగా ఉండటం, వాంతులు కావడం, తీవ్రమైన జ్వరం వస్తుంది.డెంగీ జ్వరం వల్ల రక్త కణాలు తగ్గిపోతుంటే కంటి చుట్టు వాపు, కంటి లోపల నొప్పి, కండరాలనొప్పి, కడుపునొప్పి, మలం నల్లగా రావడం వంటివి ప్రమాదకర డెంగీ జ్వరం లక్షణాలు. రెండు మూడు రోజులు జ్వరం తగ్గనప్పుడు తప్పనిసరిగా రక్తపరీక్ష చేయించుకుంటే అందులో రక్త కణాలు తగ్గిపోతున్నాయా లేదా అనేది తెలుస్తుంది. రక్త కణాలు లక్షకుపైగా ఉంటాయి. రక్త కణాలు 10 వేల

ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో భారీగా క్యూకట్టిన జ్వరపీడితులు

నుండి ఇరవై వేలకు పడిపోతే మెదుడు ఇతర శరీర భాగాలకు రక్తస్రావం జరిగి ప్రమాదకరంగా మారుతాయి. పై లక్షణాలు వుంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.

మలేరియా లక్షణాలు: ఇవి దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో వస్తాయి. వీటి లక్షణాలు చలితో తీవ్ర జ్వరం రావడం, ఒళ్ళ నొప్పులు, నీరసంగా ఉండడం, మోషన్స్ కావడం, జాండీస్ రావడం వంటి లక్షణాలు ఉంటే టెస్ట్ చేసి మలేరియా పాజిటివ్ అయితే చికిత్స చేయించుకుంటే తగ్గిపోవడానికి అవకాశం ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే ఇతర భాగాలకు మెదడు, లివరు, కిడ్నీ,గుండె వంటి భాగాలను దెబ్బతీసే అవకాశం ఉంటుంది. సరైన వైద్యం తీసుకుంటే త్వరగా కోలుకోవడానికి అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పిల్లల ఒపి పెరిగింది

పీడియాట్రిక్ హెచ్‌ఒడి డాక్టర్ బి.విజయ్ ఆనంద్ బాబు

పిల్ల విభాగంలో ఓపిలు పెరిగాయి. దగ్గు,జలుబు, జ్వరం,నీమోనియా కేసులు వస్తున్నాయి. మూడు రోజుల పాటు జ్వరం తగ్గకపోతే తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలి. డెంగ్యూ జ్వరంలో రక్త కణాలు తగ్గిపోతాయి. రక్త కణాలు 10వేలు, 20 వేలకు పడిపోతే ప్రమాదకరం. టెస్టులు మందులు జిజిహెచ్‌లో అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్‌చేసుకొని చికిత్సచేయడానికి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

వైరల్ ఫీవర్ రోగుల సంఖ్య పెరిగింది

జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లక్ష్మీబాయి

వైరల్ ఫీవర్ సంఖ్య పెరిగింది. సాధారణ ఓపిలో 50 నుంచి 60 మంది రోగులు దగ్గు, జలుబు, జ్వరం వంటి వాటికోసం చికిత్సకు వస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. డెంగ్యూ, వైరల్ ఫీవర్‌పట్ల జాగ్రత్త వహించాలి. తీవ్రత ఎక్కువ ఉన్న కేసులను అడ్మిట్ చేసుకుని చికిత్సను అందిస్తున్నాం.

వాతావరణంలో మార్పులే ప్రధాన కారణం

జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మీనుగ శ్రీనివాసులు

వాతావరణంలోకి మార్పులు రావడం వల్ల వైరల్ ఫీవర్స్ పెరిగాయి. సాధారణ జ్వరాలు త్వరగా తగ్గిపోతాయి. చల్లని వాతావరణం వల్ల డెంగీ చికెన్ గునియా, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. మూడు రోజుల మించి జ్వరాలు వస్తుంటే వైద్యుల్లో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. వైద్యులు సూచించిన మందులను వాడాలి.

రైతులకు నష్టం లేకుండా ఉల్లిని కొనాలి

- ధరల అంశాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తా
-రైతులు, వ్యాపారులతో మాట్లాడిన కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతులకు నష్టం జరగకుండా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఉల్లి విక్రయాలు సక్రమంగా జరిగేలా మార్కెటింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు.శుక్రవారం ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యతో కలిసి కలెక్టర్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్యటించారు. ఉల్లి విక్రయాలపై రైతులతో మాట్లాడి, అనంతరం మార్కెట్ కమిటీ, మార్కెటింగ్, ఉద్యాన శాఖ అధికారులు, ట్రేడర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఉల్లి రైతులతో మాట్లాడారు. ఉల్లి నాణ్యతను పరిశీలించారు.. వర్షాల వల్ల పంట దెబ్బ తిన్నదని, రేట్ చాలా తక్కువగా ఉందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని కలెక్టర్ రైతులకు చెప్పారు. అనంతరం మార్కెట్ కమిటీ, మార్కెటింగ్, ఉద్యాన శాఖ అధికారులు, ట్రేడర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డుకు ఎంత పరిమాణంలో ఉల్లి వస్తోంది, ఎంతమంది లైసెన్స్ వ్యాపారులు ఉన్నారని, అమ్మకాల వివరాల గురించి అధికారులతో ఆరా తీశారు. రైతులకు ప్రయోజనం కలిగేలా ఉల్లి విక్రయాలు సక్రమంగా జరగాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. లైసెన్స్ కలిగిన వ్యాపారులతో కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు బజార్లలో కూడా ఉల్లి కొనుగోలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపారులు నాణ్యత పేరుతో మరీ తక్కువ ధరకు కొంటే ఎలా అని కలెక్టర్ వ్యాపారులను ప్రశ్నించారు. మహారాష్ట్ర ఉల్లి చాలా ఉండటం వల్ల, వర్షాల వల్ల నాణ్యత లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాలకు ఎగుమతి కావడం లేదని వ్యాపారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఉల్లి నాణ్యతను పరిశీలించామని, కొంత బాగానే ఉందన్నారు. నాణ్యత పేరుతో నాలుగైదు రూపాయలకు కొంటే ఎలా అని కలెక్టర్ ట్రేడర్లను ప్రశ్నించారు. ధరల విషయంలో సహేతుకంగా వ్యవహరించాలని కలెక్టర్ వ్యాపారులకు సూచించారు. రైతులు ఉల్లిని లేట్ ఖరీఫ్‌లో సాగు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. కోడుమూరులో ఉల్లి విక్రయాలు జరిగేలా మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులును ఆదేశించారు. గతంలోనే ఈ అంశంపై చర్చించి, ప్రతిపాదనలు పంపాలని సూచించమన్నారు. వెంటనే ఎస్టిమేట్స్ వేయించి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. సి బెళగల్, కోడుమూరు, గూడూరు తదితర మండలాల రైతులకు దూరం తగ్గి, ఖర్చులు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు. ఆదోని మార్కెట్ యార్డులో పనులు నెమ్మదిగా సాగడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి కాకపోవడం ఏంటని మార్కెటింగ్ ఎడిని ప్రశ్నించారు. జాప్యం లేకుండా పనులు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్ పర్సన్ అజ్మత్ బీ, హార్టికల్చర్ ఏడి రామాంజనేయులు, మార్కెటింగ్ ఎడి నారాయణ మూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి, ఆర్‌డిఒ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లికి క్వింటాళుకు రూ.2వేలివ్వాలి

కలెక్టర్ ను కోరిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో పత్తి తర్వాత అత్యధిక పంటగా ఉల్లి ఉందని, ఉల్లికి క్వింటాళుకు రూ.2000 మద్దతు ధర ప్రకటించి ఉల్లి రైతును ఆదుకోవాలని సిపిఎం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ ను కోరారు. శుక్రవారం కర్నూలు ఉల్లి మార్కెట్ యార్డును సందర్శించి ఉల్లి రైతులతో మాట్లాడడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యలకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి ఆనంద్ బాబు, టి.రాముడు, జిల్లా కమిటి సభ్యులు వై.నగేష్ లు వినతి పత్రం ఇచ్చి సమస్యలను వివరించారు. అనంతరం ఉల్లితో మార్కెట్‌కు వచ్చిన రైతులతో మాట్లాడి మరిన్ని సమస్యలు కనుక్కున్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా వేసిన రెండవ పంటగా ఉల్లి ఉందని, అలాంటి ఉల్లి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కోడుమూరు మండలం గోరంట్ల నుండి మాధవస్వామి అనే రైతు నాలుగు రోజుల క్రితం 39 బస్తాలను మార్కెట్‌కు తీసుకుని వచ్చి, పట్టి రాసే దిక్కు లేక, రోజు ఆరబోసి ఎత్తుకునేందుకు సహితం కూలీ పెట్టుకోలేక తన ఉల్లిగడ్డలను మార్కెట్లోనే పారబోసి ఇంటికి వెళ్లిపోయాడన్నారు. గోనెగండ్ల మండలం ఆలువాల గ్రామానికి చెందిన రామకృష్ణ అనే రైతు 170 బస్తాల ఉల్లిగడ్డలు మార్కెట్‌కు తెచ్చి గ్రేడింగ్ కోసం 30 బస్తాలు కింద పోస్తే, గ్రేడింగ్ చేసే కూలీలకు ఇచ్చే డబ్బులు కూడా అమ్మితే వచ్చే పరిస్థితి లేదని లబోదిబోమన్నారని తెలిపారు. ఒక క్వింటాళు ఉల్లిగడ్డ పెట్టుబడి రూ.1000, కోత కోసి కుప్పపోసేందుకే రూ.500 దాన్ని మార్కెట్కు చేర్చేందుకు 200 రూపాయలు, రైతు శ్రమకు ఎలాంటి విలువ లేకుండానే రూ.1700 ఖర్చు అవుతుందని,రాష్ట్ర ప్రభుత్వం క్వింటాళుకు ఉల్లికి రూ.1200 మద్దతు ధర ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రైతుకు రూ.600 కూడా రావడంలేదని ఏడుస్తున్నారన్నారు. రైతులకు ఉల్లి క్వింటానికి రూ.2000 మద్దతు ధర ఇచ్చే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసే దళారులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

కలెక్టర్‌కు ఉల్లిరైతుల సమస్యలను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి,ఇతర నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

ప్రతి శుక్రవారం 'ఓపెన్ ఫోరం' కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందడుగులు వేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ అన్నారు. శుక్రవారం నగరపాలక సమావేశ భవనంలో 'ఓపెన్ ఫోరం' కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు పౌరులు ఎల్ఆర్‌యస్, నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై అర్జీలు సమర్పించారు. పలువురు సందేహాలను వ్యక్తం చేయగా, కమిషనర్ నివృత్తి చేశారు. కొన్ని సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని పౌరులు కూడా కమిషనర్ దష్టికి తీసుకురాగ, అక్కడికక్కడే పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులను కారణాలు అడిగితెలుసు కున్నారు.కమిషనర్ మాట్లాడుతూ.. కర్నూలు నగరంలోని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు "ఓపెన్ ఫోరం" కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల్లో తలెత్తుతున్న సమస్యలను నేరుగా విని తక్షణమే పరిష్కరించడమే ఈ ఫోరం ముఖ్య ఉద్దేశమన్నారు. పౌరులకు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా వచ్చి చెప్పవచ్చన్నారు. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు వేగవంతమైన సేవలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిపిపి బి.వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిల్డింగ్ ఇంస్పెక్టర్లు, ప్లానింగ్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్ ఫోరం'లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

వినతుల స్వీకరిస్తున్న బొగ్గుల దస్తగిరి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

-ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు మండలం, పసుపులలోని తన స్వగృహంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలను ఎమ్మెల్యేకి విన్నవించారు. ప్రతి ఒక్కరి ఫిర్యాదును శ్రద్ధగా విని, వెంటనే సంబంధిత అధికారులకు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం మమేకమై, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

సి బెళగల్‌లో నిమజ్జనానికి బయలుదేరిన గణేష్ విగ్రహాలు

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ నిమజ్జనం శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. పోలకల్, ముడుమాల, చింతామను పల్లి, సంఘాల, యనగండ్ల, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి, పల్లదొడ్డి, కొత్తకోట, కొండాపురం గ్రామాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసుకొని గణేష్ భక్తిని చాటుకున్నారు. లడ్డూలు, ప్రసాదాలు, ఇతర పూజ సామాగ్రిని వేలం వేయగా భారీగా నగదు అందింది.. నిమజ్జనం వేడుకలు ప్రశాంతంగా జరగేందుకు ఎస్ఐ పరమేష్ నాయక్ గట్టి చర్యలు చేపట్టారు..

సి బెలగల్ విద్యుత్ కు అంతరాయం

సి బెళగల్ మండల కేంద్రంలో ఎన్నడూ లేని విధంగా గణేష్ భారీ విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలు అవస్థలుపడ్డారు. మధ్యాహ్నం 2 గంటలకు నిమజ్జనం పూర్తి చేయాలని ఎస్ఐ పరమేష్ నాయక్ పోలీస్ సిబ్బంది తగు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. రాత్రి ఎనిమిది గంటలైనను విగ్రహాలు, సంబరాలు జరుగుతుండటంతో చీకట్లో వేడుకలకు అంతరాయం ఏర్పడింది.

పత్తికొండ: పత్తికొండ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి గవర్నమెంట్ హైస్కూల్ వరకు మండపాల్లో వెలిసిన వినాయకులు నిమజ్జనానికి ముస్తాబయ్యారు. పట్టణంలోని రోడ్లన్నీ సందడి వాతావరణం కనిపించింది. డిఎస్‌పి వెంకట రామయ్య ఆధ్వర్యంలో పత్తికొండ టౌన్ సిఐ జయన్న , పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా గిడుగు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

తెలుగు రాష్ట్రంలో తెలుగు భాష ప్రాధాన్యత తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇంగ్లీషు మాధ్యమానికి ప్రాచుర్యం పెరిగింది. అదే సమయంలో పాఠశాలలో తెలుగు భాష ప్రాధాన్యత తగ్గటం విచారకరమని పలువురు కవులు తమ కవితా ప్రసంగంలో తెలిపారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని టిజివి కళాక్షేత్రంలో మూడు రోజుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం సాహితీ వేదికపై గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలు వేసి రవీంధ్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య, టిజివి కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, యాగంటి ఈశ్వర్ సాహితీ సంస్థ నరసం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దండేబోయిన పార్వతి ప్రారంభించారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ విదేశాల్లో తెలుగును మన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నేర్చుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా టిజివి కళాక్షేత్రం తరపున కవులు కవయిత్రులను శాలువా జ్ఞాపికలతో సత్కరించారు. కవి సమ్మేళనంలో డాక్టర్ చిట్యాల దేవేంద్రప్ప, డాక్టర్ స్వరూప్, డాక్టర్ దండబోయిన పార్వతి, గద్వాల ఈరన్న, శ్రీనివాసరెడ్డి, సునీతరాణి, లీలావతి, డి.హసీనాబీ, సి.పుణ్యవతి, పార్వతయ్య, వెంకటేశ్వర్లు, ఆవుల చక్రపాణి, అనుభవాలు ధరిత్రిదేవి, డాక్టర్ గుబ్బ బాలస్వామి, జి బలరామయ్య కవితలను వినిపించారు.

విద్యార్థుల వ్యాసరచన: శుక్రవారం ఉదయం వివిధ పాఠశాలలకు చెందిన కళాశాలలకు చెందిన విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు. ఇందులో ఆదోని నుంచి 20 మంది బాలికలు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకొని పోటీల్లో పాల్గొనడం విశేషం.

నేడు నిర్విరామ రంగస్థలం: శనివారం ఉదయం 9 గంటలకు ఏకపాత్రుల పోటీలు జరుగుతాయి. ఇందులో 81 మంది కళాకారులు 24 గంటల రంగస్థలం ప్రదర్శన చేస్తారు. ఈ ప్రదర్శనను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎక్కించడానికి సంబంధిత అధికారులు వస్తున్నారు.

తెలురు కవులు, రచయితలనుసన్మానిస్తున్నలలిత కళాసమితి నిర్వహకులు

కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

సిఐటియు ఓల్డ్ సిటీ మహాసభలో నాయకుల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఉద్యోగ ,ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులు కలిసి సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి గౌస్ దేశాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కోరారు. శుక్రవారం కర్నూలు పాత బస్తీలోని జిబి ఫంక్షన్ హాలులో సిఐటియు నగర 3వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. సిఐటియు జండావిష్కరణ సీనియర్ నాయకులు కెవి.సుబ్బయ్య చేశారు. నగర మాజీ అధ్యక్షులు కె.రాజగోపాల్ చిత్రపటానికి పూలమాలవేసి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. సంతాపాన్ని ఎస్ఎండి షరీఫ్ ప్రవేశపెట్టారు. డి.గౌస్ దేశాయ్, ఎండి.అంజిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తున్నదన్నారు. గతంలోవందల ఏళ్ల క్రితం పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను ,ఒక్క కలం పోటుతో దాన్ని తుడిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని గంటలు ఎనిమిది గంటల నుండి 12 గంటల వరకు పెంచాలని, స్త్రీలు రాత్రి డ్యూటీలు చేయాలని ఏప్రిల్ నెలలో జరిగిన కేంద్ర క్యాబినెట్ చర్చలలో తీర్మానం చేశారన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ లకు ఆదాని ,అంబానీ వారికి ఉడిగం చేయడం కోసం పని గంటలను పెంచుతుందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం శాతం పెరుగుతుందని, ఎక్కడ చూసినా పరిశ్రమలు మూతపడుతున్నాయని ,కొత్త పరిశ్రమలు రావడంలేదని , కొత్తగా ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని, ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నపూర్ణగా పిలువబడే మన భారతదేశం నేడు ఆకలి మంటల తో విల విల మాడుతుందన్నారు. రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించిన బిజెపి ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. విభజన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నాడు టిడిపి ఆవిర్భావం చేసినప్పుడు తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ,లౌకిక పార్టీగా ,తెలుగు ప్రజల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన పార్టీని నేడు నారా చంద్రబాబు తన రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఆంధ్ర రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం దగ్గర తాకట్టు పెట్టారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ,కార్మిక సంక్షేమం గాలి వదిలేశారని, పేద మధ్యతరగతి ప్రజలపై భారలు వేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ ,కార్మిక ,కర్షకులు అందరూ ఐక్యమై కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు, వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఉద్యమాలు చేయడానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో సిఐటియు నగర అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్ ఉపాధ్యక్షులు రాజశేఖర్, మహామూద్ కాజా పాషా , సిఐటియు నగర కార్యదర్శి మారెళ్ళవిజయ రామాంజనేయులు, సిఐటియు నగర సహాయ కార్యదర్శి కె. రామకృష్ణ, సాల్మన్ రాజు ,రవి, వి.నాగస్వాములు ,కుమార్, బి. రాంబాబు ,ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు నాయ కులు నాగసుంకన్న, నోమేశ్వరి ,సరిత, లక్ష్మి కళాకారులు, వివిధ సంఘాల, యూనియన్ల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు, వేదికపై గౌస్‌దేశాయి

ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి కర్నూలుకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ శంకర్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్టేడియం ఆవరణలో ఉన్న పద్మభూషణ్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 1975 సంవత్సరం నుంచి ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. ధ్యాన్ చంద్ హాకీ క్రీడకు సంబంధించి భారతదేశానికి మూడు సార్లు ఒలింపిక్‌లో పథకాలు తెచ్చారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా గర్వించదగ్గ వ్యక్తి ధ్యాన్‌చంద్ భారతదేశంలో పుట్టడం గర్వంగా ఉందన్నారు. ధ్యాన్ చంద్ గొప్ప తనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల కులమతాలకు అతీతంగా వారు క్రమశిక్షణతో జీవిస్తున్నారన్నారు. ధ్యానం, యోగాతో పాటు మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో విజేతలకు డాక్టర్ శంకర్ శర్మ బహుమతులు అందజేశారు... జిల్లా క్రీడా అభివృద్ధిఅధికారి భూపతి రావు, క్రీడా ప్రతి నిధులు రామాంజనేయులు, సుధీర్, నాగరత్నమయ్య, గంగాధర్, పరుశ రాముడు, ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, పాపా శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నబిసాహేబ్ తదితరులు పాల్గొన్నారు...



ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ శంక్‌శర్మ భూపతిరావు, తదితరులు

ఐదుగురు కవులకు గిడుగుపురస్కారాలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ప్రపంచప్రసిద్ధి చెందిన సముద్రశాస్త్ర వేత్త కీశే డాక్టర్ ఎంపిఎం రెడ్డి స్థాపించిన ప్రముఖ సాహిత్య సంస్థ తెలుగు కళాస్రవంతి కర్నూలుకు చెందిన ఐదుగురు కవులకు గిడుగురామ్మూర్తి స్మారక తెలుగు భాషా పురస్కారాలను తెలుగు కళా స్రవంతి సంస్థ గిడుగు రామ్మూర్తి భాషా పురస్కారాలను అందించారు. పురస్కారాలను అందుకున్న వారిలో కవులు ఎస్‌డివి అజీజ్ , ఎన్.నాగమణి, మారుతీ పౌరోహితం, తెలుగు వెంకటేష్ కెంగార మోహన్‌లకు అందించారు. నగరంలోని పింగళిసూరన తెలుగుతోటలో గిడుగు జయంతి సందర్భంగా తెలుగు భాషాదినోత్సవం వేడుకలను నిర్వహిస్తూ మాట,పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షకార్యదర్శులు ఎన్ఎండి ఇనాయతుల్లా, కన్వీనర్ మహమ్మద్ మియాలు సమన్వయకర్తగా వ్యవహరించారు. పురస్కార సభకు అధ్యక్షులుగా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కెజి గంగాధర రెడ్డి, ముఖ్యఅతిథిగా గాడిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ కురాడి చంద్రశేఖర కల్కూరా, విశిష్ట అతిథిగా తెలుగు భాషా వికాస ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి జెఎస్‌ఆర్‌కె శర్మ లు ప్రసంగించారు.

గిడుగు పురస్కారంతో కె మోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

13 సార్లు డీఎస్సీ చంద్రబాబు ఘనత

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

14 ఏళ్ల ముఖ్య మంత్రి హోదాలో 13 సార్లు డీఎస్సీ జరిపిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని, యువత నమ్మకాన్ని నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 16,347 మెగా డీఎస్సీని దిగ్విజయంగా పూర్తి చేసిందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం డీఎస్సీకి సమాధి కట్టిందని విమర్శించారు. యువత బాగుపడటం ఇష్టం లేని ప్రతిపక్ష నేత మెగా డీఎస్సీని ఆపేందుకు దొడ్డిదారిన 24 కేసులు వేయించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనిపైనా వైసిపి బురద చల్లుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యా వ్యవస్థను గొప్పగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. టౌన్ బ్యాంక్ ఛైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ మల్లయ్య, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండల అధ్యక్షులు కెటి.వెంకటేష్, ఖాసీం వలీ, తిరుపతయ్య నాయుడు, తెలుగు మహిళా నాయకులు సి.విజయలక్ష్మి, కౌన్సిలర్ సరోజ, మాజీ కౌన్సిలర్ కలీముల్లా, టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ నర్సప్ప, నాయకులు రాజేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

గోడౌన్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రికార్డులను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

పౌర సరఫరాల గోడౌన్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వలు, రికార్డుల నిర్వహణ, భద్రత ఏర్పాట్లు తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో లోపాలు లేకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో వ్యవహరించాలని తెలిపారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా, సమయానికి రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తహశీల్దార్ రమేష్, డిప్యూటీ తహశీల్దార్ రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేద్దాం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

గణేశునికి పూజలు నిర్వహిస్తున్న కృష్ణమ్మ

ప్రశాంత వాతావరణంలో ఆదివారం జరిగే వినాయక నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహిద్దామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. పట్టణంలో కల్లుబావి ప్రాంతంలో గణేశుని దర్శించుకున్నారు. మాజీ ఎంపిపి మురళీ, కల్లుబావి మల్లికార్జున, సాధిక్ వలీ, రాజశేఖర్, నరసప్ప, లక్ష్మీనారాయణ, కల్లుబావి ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

బెల్డోన సొసైటీలోనూ ఎరువులు

- సొసైటీ సిఇఒ హరికృష్ణ

ప్రజాశక్తి - చిప్పగిరి

గోడౌన్‌లో ఎరువులను దించుతున్న హమాలీలు

బెల్డోన వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శనివారం నుంచి ఎరువులు అందుబాటులోకి వచ్చాయని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బెల్డోన సొసైటీ సిఇఒ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా సొసైటీ అధికారుల ఆదేశాల మేరకు శనివారం నుంచి బెల్డోన సొసైటీ గోడౌన్లలో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గోదావరి డిఎపి సంచులను గోడౌన్లలో దించారని, కావాల్సిన రైతులకు తీసుకోవచ్చని తెలిపారు. ఇక నుంచి రైతులకు కావాల్సిన ఎరువులన్నీ సహకార సంఘం గోడౌన్లలో నిల్వ ఉంచుతామన్నారు.

నేడు బిల్లేకల్లు కూరగాయల మార్కెట్ వేలం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు కూరగాయల మార్కెట్ వేలం శనివారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అంజినేయులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. 2025-26వ సంవత్సరం టమోటా, కూరగాయల మార్కెట్ బహిరంగ వేలం స్థానిక ఊరువాకిలి సమీపంలో ఉన్న దర్గా దగ్గర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.5 లక్షల సాల్వేషన్ సర్టిఫికెట్ తీసుకొని, డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

పడకేసిన పారిశుధ్యం..!

- కనిపించని శానిటేషన్ పనులు - వృద్ధి చెందుతున్న దోమలు.. ప్రబలుతున్న విష జ్వరాలు
- డిప్యూటీ ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం
- జడ్‌పి సిఇఒ వచ్చి వెళ్లినా మారని అధికారుల తీరు

ప్రజాశక్తి -హోళగుంద

మండలంలో పారిశుద్ధ్యం పడకేసింది. శానిటేషన్ పనులు చేపట్టకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. శానిటేషన్ పనులను పర్యవేక్షించడంలో డిప్యూటి ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

మారుమూల మండలం హోళగుందకు జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి వచ్చి ఆకస్మిక తనిఖీ చేసి వెళ్లినా... డిప్యూటీ ఎంపిడిఒతో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యపు తీరు మారడం లేదు. డిప్యూటీ ఎంపిడిఒ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. శానిటేషన్ పనులు కనిపించడం లేదు. మురుగు కాలువలు, కుంటల్లో దోమల వృద్ధి చెందుతున్నాయి. విష జ్వరాలు ప్రబలి చాలామంది ఆస్పత్రి పాలవుతున్నారు. సిసి రోడ్లు, డ్రైయినేజీ పనులు చేయించే సర్పంచుల వద్ద చిల్లిగవ్వ కూడా లేకుండా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు బురదమయమయి చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామాల్లో దగ్గరుండి శానిటేషన్ పనులు చేయించాల్సిన పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి పలు గ్రామాలను తనిఖీ చేసి సమస్యలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. జడ్‌పి సిఇఒ ఆదేశాలనే బేఖాతరు చేస్తున్నారనేది స్పష్టంగా అర్థమవుతోంది. వందవాగలి, గజ్జహళ్లి గ్రామాల్లోనూ పారిశుద్ధ్యం పడకేసింది. శానిటేషన్ పనులు జరగడం లేదు. ఈ గ్రామాల్లో వర్షాలు అధికంగా కురిస్తే.... మురుగు వర్షపు నీరు నిలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు మండలంలో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని, అధికారులు చలనం వస్తుందని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

అనుభవంలో ఉన్న రైతులకే భూములపై హక్కు కల్పించాలి

- తహశీల్దార్ వద్ద రైతుల మొర

ప్రజాశక్తి - మంత్రాలయం

ఏళ్లుగా అనుభవంలో ఉంటూ సాగు చేసుకుంటున్న తమకే హక్కు ఉందని, ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేయాలని తహశీల్దార్ కె.రమాదేవితో రైతులు మొర పెట్టుకున్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌ను కలిసి రైతుల వద్ద ఉన్న రికార్డులను అందజేశారు. భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా ఏళ్లుగా భూముల విషయంలో శ్రీరాఘవేంద్రస్వామి మఠం వారికి, అనుభవంలో ఉన్న రైతులకు తగాదా ఉండడంతో ఇరువర్గాలకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న శ్రీమఠం వారు తమ వద్ద ఉన్న రికార్డులను అందజేశారు. సుమారు 30 మంది రైతులు తహశీల్దార్ కార్యాలయం చేరుకుని తమ వద్ద ఉన్న రికార్డులను అందజేసి విచారణకు వచ్చినట్లు సంతకాలు చేశారు. బాధితులు కామాటి రాఘన్న, వనికె నాగరాజు, వనికె గురురాజ, గనేకంటి సున్నం రఘు, గనేకంటి సున్నం రామకృష్ణ, వీరయ్య శెట్టి మాట్లాడారు. 2009లో వచ్చిన తుంగభద్ర నది వరద వల్ల కొందరి వద్ద ఉన్న రికార్డులు పోయాయని తెలిపారు. 2014 వరకు ప్రభుత్వాల నుంచి పంట నష్టపరిహారం కూడా అందుకున్నామని చెప్పారు. 2017లో ఆన్‌లైన్‌లో శ్రీరాఘవేంద్రస్వామి మఠం పేరుతో తమ భూములను రెవెన్యూ అధికారులు ఎక్కించారని విమర్శించారు. 1964 నుంచి తమ పెద్దలు కట్టిన గుత్త రసీదులు ఉన్నప్పటికీ గత రెవెన్యూ అధికారులు శ్రీమఠం వారికి ఆన్‌లైన్‌లో ఎక్కించి ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. శ్రీరాఘవేంద్ర స్వామి మంచాల గ్రామానికి రాక ముందే ఇక్కడ రైతులకు భూములు ఉన్నాయని, సుమారు 200 ఏళ్లుగా తమ కుటుంబాల వారే భూములు సాగు చేస్తున్నామని తెలిపారు. 1975 కంటే ముందు వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీలు తీస్తే తమ పెద్దల పేర్లు ఉన్నాయని, తర్వాత మార్చారని చెప్పారు. 17వ శతాబ్దంలో ఆదోని నవాబ్ సిద్దు మసూద్ ఖాన్ దానంగా ఇచ్చిన రికార్డులను చూపించాలని, తమ దగ్గర కూడా పాత రికార్డులను చూపిస్తామని తెలిపారు. భూములను వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో కూడా సాగులో ఉన్న వారి పేర్లు ఎక్కించి తమకు న్యాయం చేయాలని కోరారు. తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ... ఇరువర్గాల వారు ఇచ్చిన రికార్డులను ఉన్నతాధికారులకు పంపడం వరకే తమ బాధ్యత అని తెలిపారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

వేలంపాట నిర్వహిస్తున్న సర్పంచి రాధమ్మ

రూ.కోటి పలికిన మార్కెట్

- పంచాయతీకి రూ.35 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో టమోటా, కూరగాయల మార్కెట్ రికార్డు స్థాయిలో రూ.కోటి పలికింది. శుక్రవారం పాత పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ గీతావాణి ఆధ్వర్యంలో సర్పంచి మూలింటి రాధమ్మ అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మహేంద్ర, మైబు, ఎస్.తిమ్మన్న, రంగనాథ్, అరవింద్, సంజప్ప, విశ్వనాథ్, రామకృష్ణ, గోపాల్ పాటదారులు పాల్గొన్నారు. సర్కారు వారి పాట రూ.65 లక్షలతో వేలం ప్రారంభించారు. వేలం హోరాహోరీగా సాగింది. చివరికి ముల్లా మైబు రూ.కోటి దక్కించుకున్నారు. గతేడాది రూ.65 లక్షలు పోగా ఈ ఏడాది రూ.కోటి వేలం పలికింది. పంచాయతీకి రూ.35 లక్షల ఆదాయం పెరిగింది. రెండు రోజుల్లో 50 శాతం, పాడిన మొత్తాన్ని 15 రోజుల్లో చెల్లించాలని ఎంపిడిఒ, సర్పంచి తెలిపారు. లేకపోతే టెండర్ వేస్తామని చెప్పారు. గతేడాది గ్రామాభివృద్ధి కోసం 25 శాతం తీసిన రూ.16.25 లక్షలు, ఈ ఏడాది వేలం పాటలో రూ.కోటితో పంచాయతీ తరఫున టమోటా, కూరగాయల మార్కెట్ శాశ్వత స్థలం కొనుగోలు చేస్తామని సర్పంచి మూలింటి రాధమ్మ బహిరంగ వేలంలో గ్రామ పెద్దల సమక్షంలో తెలిపారు. ఈ వేలం పాటల్లో ఎలాంటి గొడవలూ జరగకుండా సిఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ విజయ, ఎస్.నరసింహులు, కెడిసిసి జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి విజయరాజు, వైస్ సర్పంచి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 9వ తరగతి విద్యార్థిని ముకుంద ప్రియ పెన్సిల్‌తో వినాయకుని చిత్రాన్ని వేసి ప్రతిభను చాటింది. శుక్రవారం రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన సుజిత, మల్లికార్జున కుమార్తె ముకుంద ప్రియ గతంలోనూ సూక్ష్మ కళాకారిణిగా చెస్ బోర్డు, ఇస్రో రాకెట్‌ను చాక్‌పీస్‌లపై వేసి ప్రతిభ చూపింది. అర్ధనారీశ్వరులు, శివ పార్వతులు, రాఘవేంద్ర స్వామి చిత్రం, దసరా పండగ సందర్భంగా అమ్మవారి రూపం, ఆంజ నేయ స్వామి మూర్తిని వేశారు. ప్రస్తుతం వినాయకుని చిత్రం వేసి చిత్రలేఖనంలో సాటిలేని విద్యార్థిగా గుర్తింపు పొందడంతో పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రాఘవేంద్ర, ప్రధానోపాధ్యాయులు అశ్విని అభినందించారు.

తెలుగు భాషను గౌరవిద్దాం

- అమరావతి స్కూల్ కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

మాతృ భాష తెలుగును ప్రతి ఒక్కరూ గౌరవించాలని అమరావతి స్కూల్ కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణలో తెలుగుతనం ఉట్టిపడేలా ఆకట్టుకున్నారు. తెలుగు భాష గొప్పదనం నాటకం, నృత్య, పద్యాలు, సామెతలు, వ్యాకరణం, గేయాలు, పాటలు ప్రదర్శించారు. అలాగే శ్రీకృష్ణదేవరాయల రాజ్యంలోని అష్టదిగ్గజ కవుల వేషధారణలో విద్యార్థులు పలు పద్యాలు, అల్లసాని, పెద్దన, తెనాలి రామకృష్ణ, ధూర్జటి, రామభద్రుడు, నంది తిమ్మన్న పద్యాలను పాడుతూ వివరణతో సహా చక్కటి నాటకం ప్రదర్శించారు. ఛందస్సు, అలంకారాలు, సంధులు, సమాసాలు, వ్యాకరణంతో కలిసిన ఒక గేయాన్ని చక్కగా వివరించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్‌ను స్మరిస్తూ విద్యార్థులు బహు క్రీడాకారుల వేషధారణలో వారి గురించి, వారు సాధించిన బిరుదులు, బహుమతుల గురించి వివరించారు. ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నేషనల్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల అధినేత గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ, పాఠశాల డైరెక్టర్ విజయ్ కుమార్, ప్రైమరీ ఇన్‌ఛార్జీ అనిల్ కుమార్, జిఎస్ఆర్ ఇన్‌ఛార్జీ కిశోర్ హాజరయ్యారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. విద్యార్థులకు కబడ్డీ, త్రో బాల్ పోటీలు నిర్వహించారు. మండలంలోని దొడ్డనకేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 ఏళ్లుగా తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్న విద్యా వాచస్పతి డాక్టర్ గరుడాద్రి దత్తాత్రేయ శర్మ పద్యాలతో రణం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉపాధ్యాయులు, అతిథులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ సిఐ శ్రీరామ్, కర్నూలు త్రీ టౌన్ సిఐ శేషయ్య, తెలుగు యువత నాయకులు సిద్ధార్థ నాయుడు, రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి, సుస్వరం నాగరాజు, విహెచ్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, లింగన్న పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ హైస్కూల్‌లో క్రీడా దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్ఆర్ లేబర్ కాలనీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి ఆధ్వర్యంలో తెలుగు భాష, క్రీడా దినోత్సవం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు ప్రహ్లాద, పీడీ రామకృష్ణను సన్మానించి, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు వీర చంద్ర యాదవ్, శ్రీరాములు పాల్గొన్నారు. పట్టణంలోని మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో శ్రీగర్జిలింగేశ్వర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.లింగమ్మ, ప్రధానోపాధ్యాయులు పరమేష్ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వివిధ తెలుగు పద్యాలు, చార్టుల ద్వారా ప్రదర్శించి రాగయుక్తంగా పాడి తెలుగు భాషపై అభిమానాన్ని చాటారు. ఉపాధ్యాయులు రవి, పురుషోత్తం, ఉలిగప్ప, రమాదేవి, ఆఫ్రిన్, భువనేశ్వరి, చాకలి కాలింగప్ప పాల్గొన్నారు. **కోసిగి** మండలం పల్లెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు దస్తగిరి బాషా అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు రామిరెడ్డి, ఎంపిటిసి వెంకట రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. గ్రామ సభ్యులు నాగిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకట లక్ష్మీ, ఆనంద్, శ్రీధర్ బాబు, నాగేంద్ర ప్రసాద్, శాంతన్న, వెంకటేష్, వరలక్ష్మీ పాల్గొన్నారు. **హోళగుంద**లో ఉపాధ్యాయులతో కలిసి హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కబీర్ సాబ్ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **దేవనకొండ** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో తెలుగు భాష, క్రీడా దినోత్సవం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న సిఐ

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాఠశాల సిబ్బంది

కోసిగి

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలో గణేష్ నిమజ్జనం కనుల పండువగా సాగింది. శుక్రవారం వినాయకుని ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన మూడో రోజు వినాయకుని పూజలు నిర్వహించి, తోగలగల్లు, తంగరడోన, నగరూరు, బిణిగేరి, చిరుమాన్‌దొడ్డి, హాలిగేర, యాటకల్లు, కైరుప్పల, ములుగుందం, కారుమంచి, జొహరాపురం, చిన్నహోతూరు, చిగిలి తదితర గ్రామాల్లో లడ్డు వేలం పాటలు నిర్వహించారు. ఊరేగింపుగా విగ్రహాలను తీసుకెళ్లారు. అనంతరం చెరువు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఆస్పరి చెరువు దగ్గర సర్పంచి మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. అవాంఛ నీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిఐ.గంగాధర్ బందోబస్తు నిర్వహించారు. ఎంపిడిఒ గీతావాణి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి చెరువును పర్యవేక్షించి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, ఆర్ఐ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి విజయ రాజు, విఆర్ఓ మాబు పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించారు. డోళ్లు, మేళతాళాలతో ముందు భక్తులు నృత్యాలు చేస్తూ ఊరేగించి ఎల్ఎల్‌సిలో నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సర్పంచి రంగమ్మ ఆధ్వర్యంలో లైట్లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ఆలూరు సిఐ, ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. **చిప్పగిరి** మండలంలో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు తెలిపారు. నేమకల్లులో వినాయక ఊరేగింపు వేడుకలు రాముస్వామి ఆధ్వర్యంలో వైభవంగా సాగాయి. మహిళలు, యువకులు నృత్యాలు, చక్కటి డ్రస్సులతో ఆకట్టుకున్నారు. శివాలయంలోని వినాయకుని లడ్డు, తదితర వస్తువులకు రూ.లక్షకు పైగా వేలంపాటలో వచ్చినట్లు రాముస్వామి తెలిపారు. **కౌతాళం** మండలంలో గణపతి శోభయాత్ర పలు గ్రామాల్లో ప్రశాంతంగా నిర్వహించారు. కామవరం, ఎరిగేరి, రౌడూర్, బాపురం, హాల్వి, చూడి, చిరుతపల్లి, ఉరుకుంద, సులేకేరి, మధిర, పొదలకుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథులకు పూజలు నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. కౌతాళంలో ఊరేగింపు అనంతరం లక్ష్మమ్మ గుడి సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనం చేశారు. గణేష్ కేంద్ర కమిటీ అధ్యక్షులు వెంకటపతి రాజు ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ చేపట్టారు. తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, సర్పంచి పాల్ దినకరన్ ఏర్పాట్లను పరిశీలించారు. సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. **దేవనకొండ** మండలంలో పోలీసు బందోబస్తు మధ్య వినాయక నిమజ్జనం నిర్వహించారు. దేవనకొండ బస్టాండ్ నుంచి ప్రధాన రహదారుల గుండా డప్పు వాయిద్యాలతో వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తరలించారు. యువకుల కేరింతలు, డ్యాన్సులతో ప్రధాన రహదారులు మార్మోగాయి. ఎర్ర చెరువులో నిమజ్జనం చేశారు. తహశీల్దార్ రామాంజనేయులు, ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ గోపాల్, సిఐ విశ్వనాథ్ పర్యవేక్షించారు. **మంత్రాలయం**లో భక్తులు, ప్రజలు, మహిళలు, చిన్నారులు, కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో కోలాటాలతో డిజె భక్తి పాటలతో రంగులు వేసుకుంటూ పుర వీధుల్లో ఊరేగించారు. రామచంద్ర నగర్‌లోని పాత గ్రంథాలయం ముందు ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ద్వారక మిత్ర మండలిలో వడ్డే నారాయణ, సావిత్రి దంపతుల కుమారుడు వడ్డే వెంకటరాజు, లక్ష్మీదేవి దంపతులు సుమారు 200 మందికి అన్నదానం చేపట్టారు. పేగుల రాము, లక్ష్మి దంపతులు ఫలహారం పంపిణీ చేపట్టారు. వినాయక మిత్రమండలి మండప నిర్వాహకులు వడ్డే వెంకటరాజు, తెలుగు హనుమంతు, తెలుగు కొండ, పేగుల రాము, పేగుల నాగరాజు, గురు, రంజిత్, హరీష్ రాజు, అభి, నితీష్, సుబ్రహ్మణ్యం వారి ఆధ్వర్యంలో యువ నాయకుడు బొంబాయి శివకు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. సిఐ రామాంజులు, ఎస్ఐ ఎల్.శివాంజల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆస్పరిలో పాల్గొన్న ఎంపిడిఒ, తహశీల్దార్, సిఐ

కౌతాళంలో నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రాలయంలో నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం

ఉనికి కోసం వైసిపి ఆరాటం

- మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

ఉనికి కోసమే వైసిపి ఆరాట పడుతోందని టిడిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్ తెలిపారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామాల అభివృద్ధిని ఓర్వలేక వైసిపి నాయకులు గ్రామాల్లోకి వెళ్లి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' నినాదంతో ప్రజలకు అసత్యాలను ప్రచారం చేస్తూ మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. వారి బూటపు నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఐదేళ్ల వైసిపి విధ్వంస పాలనతో ప్రజలు విసిగి చెంది గత ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. మండలంలో రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వారి పాలనలో పత్తి రైతులు గిట్టుబాటు ధర రాక ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోయారని చెప్పారు. ఇప్పుడు పొలాల దగ్గరికి వెళ్లి రైతులను పరామర్శించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రం సుభిక్షంగా ఉందని. ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం డాక్టర్లు, మీడియా, దళితులు, మహిళలు, పూజారులపైనా దాడులకు పాల్పడిందని విమర్శించారు. కూటమి పాలనలో రూ.కోట్లలతో మండలంలోని రోడ్లను అభివృద్ధి చేశామని తెలిపారు. మినీ గోకులాలు నిర్మించి రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చామని చెప్పారు. డీఎస్సీ కోసం ఎదురుచూసిన నిరుద్యోగులకు డీఎస్సీ ఇచ్చి ఎంతోమంది ఉపాధ్యాయులుగా కావాలన్న వారి కలను నెరవేర్చామన్నారు. పోలీసు ఉద్యోగాల కలన కూడా నెరవేర్చిన ఘనత కూటమిదని తెలిపారు. వైసిపి పాలనలో అక్రమ కేసులు, సామాన్యులపై దాడులు చేసి సాధారణ వ్యక్తి బహిరంగంగా మాట్లాడే స్వేచ్ఛ కూడా ఉండేది కాదన్నారు. ఏ ప్రభుత్వం మంచిదో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

మనేకుర్తి మాజీ సర్పంచి మృతి

- కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పరామర్శ

ప్రజాశక్తి-ఆలూరు

హనుమంతమ్మ (ఫైల్)

మండలంలోని మనేకుర్తి మాజీ సర్పంచి ఎం.హనుమంతమ్మ (79) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. హనుమంతమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు ఎం.రాజశేఖర్ తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధిగా, క్లస్టర్ ఇన్‌ఛార్జీగా బాధ్యతలు నిర్వహించారు.

కోట్ల సుజాతమ్మ పరామర్శ

మనేకుర్తి గ్రామంలోని మాజీ సర్పంచి ఎం.హనుమంతమ్మ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కురువ జయరామ్ తనయుడు రఘు, కమ్మరచేడు మాజీ ఎంపిటిసి మద్దిలేటి, దిబ్బనకల్లు సర్పంచి లక్ష్మన్న, టిడిపి మండల కన్వీనర్ అశోక్, మాజీ ఎంపిటిసి గోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. హనుమంతమ్మ తనయుడు రాజశేఖర్‌ను, వారి కుటుంబాన్ని పరామర్శించారు.



హనుమంతమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సుజాతమ్మ

'జాగ్రత్తలతో క్షయ నిర్మూలన'

ప్రజాశక్తి - ఆదోని

క్షయవ్యాధిని జాగ్రత్తలతో నయం చేయవచ్చని షరీఫ్ బజార్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్ భాను తెలిపారు. 'క్షయ ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు బాబురాజు, డిపిఎంఒ సీతారాముడు, జ్ఞానేశ్వర్, సుబ్బమ్మ బాయి, హనుమంతమ్మ, ఆశాలు శిరిన్, నీలమ్మ, త్రివేణి పాల్గొన్నారు.

ఓ బొజ్జ గణపయ్యా.. యూరియా అందించయ్యా..!

- వినాయక విగ్రహానికి రైతుల వినతి

ప్రజాశక్తి - కౌతాళం

'ఓ బొజ్జ గణపయ్యా..! జిల్లాలోని పశ్చిమ ప్రాంత రైతులకు యూరియాను అందించవయ్యా' అంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం గణపతి విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య మాట్లాడారు. ఎరువులందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు కూటమి ప్రభుత్వ నాయకులకు, వ్యవసాయ అధికారులకు అర్థమయ్యేలా చెప్పి, రైతులకు యూరియా అందేలా చూడాలని కోరారు. మండలానికి 2 వేల టన్నుల యూరియా తెప్పించడానికి కృషి చేయాలని తెలిపారు. రైతుసంఘం నాయకులు వీరేష్, నాగరాజు, ఈరన్న, మారుతి, పరుశ, హనుమంతు, శ్రీను, వీరేష్ పాల్గొన్నారు.

విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉల్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉల్లి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం మండల కమిటీ నాయకులు వీరేష్, రాముడు కోరారు. శుక్రవారం హార్టికల్చర్ అధికారి అపర్ణకు, విలేజ్ హార్టికల్చర్ అధికారి ఇందిరాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో వందలాది ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగు చేస్తున్నారని, ఉల్లి పంట సాగుకు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారని తెలిపారు. ఉల్లికి కుళ్లు తెగులు సోకడంతో దిగుబడి తగ్గిందని, మరోవైపు వచ్చిన దిగుబడికి మార్కెట్‌లో ధర పడిపోవడంతో పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చాలామంది రైతులు ఉల్లి పంటను మార్కెట్‌కు తీసుకెళ్లకుండా పొలాల్లోనే దున్ని వేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి క్వింటా రూ.1,200 ప్రకారం కొనుగోలు చేయాలని కోరారు. నష్టపోయిన ఉల్లి రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రకాష్, నరసింహులు, బసన్న, ఈరన్న పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

IN THE COURT OF THE PRL
JR.CIVIL JUDGE : KURNOOL
O.S.NO.1198/2024

G. Amarnath Reddy. ...Plaintiff
-Versus-
A.Vinod Kumar S/o A.Veerabhadraiah, H.No.51-980-111A, Indira Gandhi Nagar, Now Residing at H.No.51-967-A-3-6, Illur Nagar, Near Seetharam Nagar Centre, Kurnool City. ...Defendant

ప్రతివాదికి దావా సమన్లు

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూపాయలు 1,21,000/- ముందు వడ్డీ, కోర్టుఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయినా నీకు ఆక్షేపణ ఉన్న 23-09-2025 తేదీన పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపగలరు లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఎ. ఉమాదేవి,
నీలోఫర్ బేగం,
వాదిపరం అడ్వకేట్లు, కర్నూలు.

IN THE COURT OF THE PRL
SR.CIVIL JUDGE : KURNOOL
I.P.NO.21/2025

Kummari Ravi kumar. ...Petitioner
-Vs-
Mallesh and Others. ...Respondents

NOTICE TO R2 TO R6

R2) శ్రీదేవి భర్త నిల్, సాయిబాబా గుడి దగ్గర, వాటర్ ట్యాంక్ పక్కన, దుర్గా హోటల్ వెనుక, కృష్ణారెడ్డి నగర్, బళ్లారి చౌరస్తా, కర్నూలు.
R6) మెట్ల సుధాకర్ రెడ్డి తండ్రి చిన్న సత్యారెడ్డి, 3వ వీధి, ఎదవ ప్రక్కన ఫిల్టర్ వాటర్ లైన్ ఎదురుగా, గోపినగర్, కల్లూరు. కర్నూల్ సిటీ.

పై నెంబర్ ఐ.పిలో అర్జీదారు అయినా కుమ్మరి రవికుమార్ తండ్రి కె.సోమన్న, డ్రైవర్, ఇంటి నెంబర్ 7-116-10, కృష్ణారెడ్డి నగర్, దుర్గా హోటల్ దగ్గర, కల్లూరు అనునతుడు తనను దివాళ దారుగా తీర్మానించమని మరియు అతని ఆస్తిని అఫీషియల్ రిసీవర్ స్వాధీనం చేసుకోమని పై కోర్టులో దివాలా అర్జీ (ఐ.పి) దాఖలు చేసినాడు. ఇందులో 2,6 రెస్పాండెంట్లు అయినా మీకు ఆక్షేపనలు ఉన్న 29-09-2025వ తేదీన పైకోర్టులో హాజరై తెలుసుకొనవలెను లేనియెడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టువారి ఉత్తర్వు మేరకు

ఎన్. శివ నిఖిలేశ్వర్ రెడ్డి,
అర్జీదారుపరం అడ్వకేట్,
కర్నూల్

ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపల్ మహాలక్ష్మీ, తదితరులు

మైపర్ లో ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని ఏ క్యాంపు నందు గల మైపర్ ఫార్మసీ కళాశాల లో శుక్రవారం ధ్యాన్‌చంద్ జన్మదిన పురస్కరించుకొని నేషనల్ స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్‌కె.మహాలక్ష్మి మాట్లాడుతూ ధ్యాన్చంద్ స్పోర్ట్స్ కు ఎంతో సేవ చేశారన్నారు. ఆయన సేవలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికి విద్యతోపాటు స్పోర్ట్స్ ఎంతో ముఖ్యమని ,అది వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్‌రాజ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ హరి నాయక్ ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

భాష్యం లో ఘనంగా స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

డాక్టర్స్ కాలనీలోని భాష్యం పాఠశాలలో స్పోర్ట్స్‌డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ జిల్లా ఒలంపిక్ సంఘం సిఇఒ పి.విజయ్ కుమార్, కర్నూలు జిల్లా ఒలంపిక్ కార్యనిర్వహక కార్యదర్శి పి.సునీల్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు సెల్ ఫోన్లలో వీడియో గేమ్స్‌కు అలవాటై క్రీడల, వ్యాయామం పట్ల అశ్రద్ధ చూపుతున్నారని అన్నారు. పాఠశాలలు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వటం అభినందనీయమన్నారు. ర్యాంకులకు ప్రాధాన్యతను ఇచ్చే విద్యాసంస్థలు చదువుతో పాటు క్రీడలకు కూడా సమానమైన ప్రాధాన్యత నిస్తున్నాయని, క్రీడలకు కూడా పాఠశాలలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భాష్యం విద్యాసంస్థలు నూతనంగా ప్రారంభించిన స్పోర్ట్స్ ఒలంపిక్స్ లోగోను ఆవిష్కరించారు. రాయలసీమ జోన్ సిఇఒ అనిల్ కుమార్, ప్రిన్సిపల్ రాంప్రసాద్, ఛాంప్స్ హెచ్‌ఎం ప్రియాంక, వ్యాయామ టీచర్ రాజీవ్, సుధాకర్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి- వెల్దుర్తి : వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిఎల్‌పిఒ లక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్మికులను మూడు సచివాలయాలకు అనుసంధానం చేయాలన్నారు. వీధులలో చెత్తచెదారం, డ్రైనేజీ కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రెండు రోజులకోసారి నీటిని సరఫరా చేయాలని సూచించారు. తమకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని, రక్షణ సామాగ్రి కూడా అందజేయలేదని పంచాయతీ కార్మికులు డిఎల్‌పిఒ దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ నిధుల గోల్మాల్‌పై కూడా విచారణ చేశారు. ఎంపిడిఒ సుహాసినమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ల మరమ్మతులు పూర్తి చేయాలి

విభాగాల సమన్వయంతో పనులు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో అవసరమైన మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జివి. కృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 9 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ, ఇంజనీరింగ్, పట్టణప్రణాళిక, పారిశుధ్య విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పైకప్పులపై వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య తనిఖీదారులకు సూచించారు. హోర్డింగుల నాణ్యత, స్థితిగతులను పట్టణ ప్రణాళిక విభాగం క్రమం తప్పకుండా పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. అన్ని మున్సిపల్ షాపుల్లో పైకప్పులు, బయట గోడలు , అవసరమైనమరమ్మత్తులను తక్షణమే పూర్తి చేయాలని అదనపు కమిషనర్ స్పష్టంచేశారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఒ జునైద్, ఆర్‌ఐ. రాజు, తిప్పన్న, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రాజు, రమేష్ పాల్గొన్నారు.

ధ్యాన్ చంద్ స్ఫూర్తిగా క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ ను స్ఫూర్తిగా తీసుకొని చక్కటి ప్రతిభ కనబరిచి క్రీడల్లో రాణించి దేశానికి గర్వకారంగా నిలవాలని కర్నూలు జిల్లా ఒలంపిక్ ఒలంపిక్ సంఘం సిఇఒ పి విజయకుమార్ సూచించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కర్నూలు స్టేడియంలోని ధ్యాన్ చంద్ విగ్రహానికి జిల్లా ఒలంపిక్ సంఘం సభ్యులు పూలమాలలు వేసి, ఆయనను స్మరించుకున్నారు. పి విజయ్ కుమార్ కర్నూల్, డిఎస్‌డిఒ భూపతిరావు, ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ దేశం గర్వించదగ్గ క్రీడాకారుడని అన్నారు. ఆయన దేశంలోని తొలి ఒలంపియన్ పేరొందిన ధ్యాన్‌చంద్ ఒలంపిక్స్ లో హాకీ క్రీడలో పలు గోల్స్ సాధించి భారతదేశాన్ని గెలిపించాలన్నారు. ఆయన జన్మదినాన్ని భారత ప్రభుత్వం క్రీడా దినోత్సవం గా ప్రకటించిందని తెలిపారు. క్రీడల్లో రాణించాలంటే ధ్యాన్‌చంద్ ను స్ఫూర్తిగా తీసుకోవాలని క్రీడాలోకానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఒలంపిక్ సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి పి.సునీల్ కుమార్, ఒలంపిక్ సంఘం సభ్యులు సహాయక కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డి, అవినాష్ శెట్టి, శివ తైక్వాండో సతీష్, ఉష, శ్రీనివాసులు, శివయ్య పాల్గొన్నారు.

ధ్యాన్ చంద్‌కు పూలమాల వేస్తున్న భూపతిరావు, తదితరులు

శ్రీచైతన్య పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు భాస్కర్ నగర్ శ్రీచైతన్య పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం" అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ఎజిఎం సురేష్ , ఆర్‌ఐసీతారామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎజిఎం సురేష్ మాట్లాడుతూ పరభాషమోజ్ లో మాతృభాషను మరిచిపోగూడదని అని చెప్పారు. విద్యార్థులందరు సాంస్కృతిక నృత్యాలు , భువన విజయ సభ నాటికను చక్కగా ప్రదర్శించారు. పద్యాలు, గేయాలు, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, డీన్ సుబ్బయ్య, ఇంచార్జులు వర్షిణి , మాధవిలత, ఉపాధ్యాయులు విధ్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారి, సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం ప్రసన్న లక్ష్మి

అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షల స్క్రీనింగ్ పక్కగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కర్నూల్ హాస్పిటల్

డాక్టర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మహిళా ఆరోగ్య కార్యకర్తలతో ఎన్‌సిడి 4.0 పురోగతిపై సమీక్ష సమావేశం రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ శుక్రవారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు , మారుతున్న జీవనశైలి కారణంగా కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయని, నిత్యం ఒత్తిడితో కూడుకున్న జీవితం, క్షణం తీరికలేకుండా మనిషి ఒత్తిడితో సతమతమవుతున్నారన్నారు. మారిన ఈ జీవన విధానం కారణంగా వస్తున్న ప్రధాన సమస్యలు అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించి చికిత్సలు అందించాలని తెలిపారు. సర్వే అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షల స్క్రీనింగ్ పక్కగా నిర్వహించి అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆహారంలో ఉప్పు ఎక్కువ తీసుకోవడం, శారీరకశ్రమ లేకపోవడం, గంటలతరబడి కూర్చొని పనిచేయడం, ఒత్తిడి కారణమని తెలిపారు. మనం తీసుకొనే ఆహారంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అలసట, తల తిరగడం, దాహంగా ఉండడం, దృష్టి సమస్యలు, ఏకాగ్రత లేకపోవడం, ఛాతీ నొప్పి, తీవ్రమైన తలనొప్పి ఇవన్నీ రక్తపోటు లక్షణాలు అని అన్నారు. ఈ కార్యక్రమములో సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్‌రఘు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, డాక్టర్.సునీల్ కుమారి, ఆరోగ్య కార్యకర్తలు , ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

నర్సింగ్ కాలేజీలో ఎసెన్షియల్ న్యూ బర్న్ కేర్ అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో హిమాలయ వెల్నెస్ కంపెనీ, సొసైటీ ఆఫ్ మేడ్వైస్ ఇండియా (ఎస్‌ఒఎంఐ) వారి సౌజన్యంతో ఎసెన్షియల్ న్యూ బర్న్ కేర్ అనే అంశంపై నర్సింగ్ కాలేజీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ మాట్లాడారు. వారు మాట్లాడుతూ నవజాత శిశు సంరక్షణ పద్ధతులు ఆరోగ్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్స్ హెచ్‌ఒడి ప్రొఫెసర్ డాక్టర్ విజయ ఆనందబాబు, ఒబిజివై హెచ్‌ఒడి ప్రొఫెసర్ డాక్టర్ సావిత్రి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్‌ఇందిరా, నర్సింగ్ కాలేజీ వైస్‌ప్రిన్సిపల్ ఎన్ మంజులారాణి, ఎస్‌ఒఎంఐ వ్యవస్థాపకులు డాక్టర్ ఎం ప్రకాశమ్మ, నర్సింగ్ కాలేజీ, స్కూల్ బోధన సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు

వాడుకభాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉన్నత విద్య అధ్యయన సంస్థ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల కర్నూలులో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సుకు కళాశాల ప్రన్సిపల్ డాక్టర్ ఆర్ ఆదినారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూతెలుగు భాషను జీవవంతం చేసి పండిత పామరులకు విద్యార్థులకు అందరికీ అందుబాటులోనికి తెచ్చిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని అన్నారు. సవరలు అనే ప్రత్యేక పర్వత ప్రాంతాల్లో నివసించే వారి కోసం భాష లిపి వ్యాకరణం రచించి పాఠశాల నిర్మించి చదువుచెప్పి వారిని విద్యావంతులను చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అన్నారు. ఆయన సేవ మరువరానిదని కళాశాల అధ్యక్షులు ఆర్ డాక్టర్ ఆర్ ఆదినారాయణ రెడ్డి అన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన జెఎస్‌ఆర్ కె శర్మ గిడుగు రామ్మూర్తి పంతులు ఆనాటి సాంప్రదాయ భాష నమ్ముకున్న చాందసవాదులతో పోరాటం చేసి తెలుగు వాళ్లకు తెలుగు భాషను సులభతరంగా అందించారన్నారు. ఆజన్మాంతం తెలుగు, సవర భాషలు, భాష సాహిత్యం, శాసనాలు ఒంటి వాటి పరిశోధనలో విశేషంగా కృషి చేశారు. ఎక్కడ చూసినా మమ్మీ డాడీ సంస్కృతి పెరిగిపోయిందన్నారు. మన గిడుగు పిడుగు వంటి మహనీయులు జీవితాంతం భాష కోసం చేసిన కృషిని మనం గమనించి అనుసరించాలని, కాపాడుకోవాలని విద్యార్థులకు వివరించారు. బిరుదవోలు రామారావు, మధునా పంతుల సత్యనారాయణ రాసిన తెలుగు భాష పద్యాలను ,గురుతరబాధ్యత వంటి అంశాల మీద చక్కటి పద్యాలను వారు విద్యార్థులకు వినిపించారు. విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహణ చేస్తూ డాక్టర్ దండే బోయిన పార్వతి దేవి మన కమ్మనైన తెలుగు భాషను కోల్పోతే మన సంస్కృతి చరిత్ర కనుమరుగవుతాయని ఎన్ని భాషలు అయినా నేర్చుకోవచ్చు కానీ తెలుగు భాషను నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. తెలుగు భాష గేయాలు విద్యార్థులకు వినిపించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె వి మధుసూదన్ మాట్లాడారు. ఎంగోవిందరాజులు డాక్టర్ నాగలక్ష్మి, అధ్యాపకులు భాస్కర్ రెడ్డి,మహేష్ , వెంకటేష్ ,శ్రీనివాసులు వంటి బోధనేతర సిబ్బంది ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళి అర్పిస్తున్న జెఎస్‌ఆర్‌కె శర్మ, దండెబోయిన పార్వతి, తదితరులు